క్లుప్తంగా

రేపు మాంసం వ్యర్థాల సేకరణకు వేలం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి అన్ని మటన్, చికెన్ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాల సేకరణకు ఈ నెల 29న వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.20వేల డీడీ చెల్లించి, సంబంధిత పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కనీస వేలం రూ.5 లక్షలు ఉందని, నిబంధనలకు అనుగుణంగా వ్యర్థాలను సేకరించి, ప్రాసెసింగ్ పరిశ్రమలకు తరలించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9966995842, 9014491650లో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మాడ్గుల: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేసేందుకు రూ.12.70 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్ గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగలతో కొత్త శోభ

మార్కెట్ చైర్‌పర్సన్ గీత



వనభోజనంలో మార్కెట్ చైర్ పర్సన్ గీత, కుటుంబ సభ్యులు

కడ్తాల్: పల్లె పండుగలతో గ్రామాలు సరికొత్త శోభను సంతరించుకుంటాయని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత అన్నారు. గురువారం మండల పరిధి మక్తమాధారం గ్రామంలో ఆమె కుటుంబ సమేతంగా వన మహోత్సవం జరుపుకొన్నారు. అక్కడే వంటలు చేసి, గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వనభోజనాల వలన బంధుమిత్రుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని, ప్రకృతిని మనం కాపాడితే.. మనల్ని ప్రకృతి కాపాడుతుందని పేర్కొన్నారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాల్ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన సీసీరోడ్లతో పాటు, అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని నిర్మాణదారులకు సూచించారు. వేసవి నేపథ్యంలో గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యురాలు జంగమ్మ, నాయకులు రాంచంద్రయ్య, జంగయ్య, శ్రీకాంత్, దశరథం ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ

కడ్తాల్: మండల పరిధి వాస్‌దేవ్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీనుకు, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రూ.13,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు లచిరామ్‌నాయక్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. నాయకులు సుమన్‌నాయక్, చందర్‌నాయక్, దేవనాయక్, ప్రవీణ్‌నాయక్, లడ్యా, పవన్, శ్రీధర్ ఉన్నారు.

వానరం.. కలవరం

వనాలు విడిచి వానరాలు జనారణ్యంలో సంచరిస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో తిరుగుతూ ఇళ్ల పీకి పందిరి వేస్తున్నాయి. ఎవరి చేతిలో ఏమున్నా ఎత్తుకుపోవడంతో పాటు.. ఇళ్లల్లోకి చొరబడి చిందరవందర చేస్తున్నాయి. హడలిస్తే దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో కోతులు ఎటువైపు నుంచి వచ్చి ఏం చేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- జనారణ్యంలో కోతుల సంచారం
- ఇళ్లలోకి చొరబడి నానా హంగామా
- దాడులకు పాల్పడుతూ దడపుట్టిస్తున్న వైనం
- భయాందోళనలో ప్రజలు



వీధుల్లో కోతుల సంచారం

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల్లో కోతుల బెడద పెరిగింది. అడవుల్లో స్వేచ్ఛగా విహరించే వానరాలు.. పచ్చదనం తగ్గి, పల్లెల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో ప్రస్తుతం ఇదే పరిస్థితి. ఆ గుంపులను చూస్తుంటే గ్రామంలో ప్రజలంటే కోతులే ఎక్కువగా ఉన్నాయని అనిపిస్తోంది. రాత్రిపగలు తేడా లేకుండా సంచరిస్తూ ప్రజలను కలవర పెడుతున్నాయి. వాటి చేష్టలు.. జనానికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

నిత్యం తలుపులు మూయాల్సిందే...

కోతల బెడదతో ప్రజలు స్వేచ్ఛగా ఉండలేకపోతున్నారు. పగలు సైతం తలుపులు పెట్టుకొని ఇంట్లోనే గడుపుతున్నారు. సరదాగా బయట తిరగలేని దుస్థితి. ఏ మాత్రం తలుపు తెరిచి ఉన్నా.. ఇంట్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. వంట సామగ్రిని చిందవందర చేస్తున్నాయని, అందిన వస్తువులను అపహరించుకుపోతూ ఆందోళన గురిచేస్తున్నాయని గృహిణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులను భయకంపితులను చేస్తున్నాయి. కర్రలు పట్టుకొని వెళ్లగొట్టడానికి యత్నించిన వారిపై దాడి చేయడానికి వెనకాడటం లేదని పేర్కొంటున్నారు. దీంతో వాటి జోలికి పోవాలంటో భయంగా ఉందని వాపోతున్నారు. కోతులను పారదోలడానికి నిత్యం బాణాసంచాలు కాల్చుతున్నామని తెలిపారు.

అధికారులకు పట్టని కోతుల బెడద

గ్రామంలో ఏడాది కాలంగా కోతుల బెడద ఎక్కువయిందని పోల్కంపల్లి ప్రజలు పేర్కొంటున్నారు. వాటి చేష్టలను తట్టుకోలేకపోతున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉండగా కోతులను పట్టే వారిని పిలిపించాలని తీర్మానం చేశామని వెల్లడించారు. ఒకటి రెండు సార్లు వారు వచ్చారు. వానరాలు దొరకడం లేదని వదిలేశారు. ప్రత్యేక పాలన నుంచి పలుమార్లు పంచాయతీ అధికారులకు సమస్యను వివరించామని, అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఉండలేకపోతున్నాం



కోతుల బెడద అంతా ఇంతా కాదు. ప్రతి ఒక్కరినీ బెదిరిస్తున్నాయి. కర్ర పట్టుకున్నా భయపడటం లేదు. వాటి చేష్టలతో ఇబ్బంది పడుతున్నాము. ఇళ్లను ఆగం చేస్తున్నాయి. ఇంట్లోని సామగ్రి, ఆరు బయట ఆరేసిన దుస్తులను ఎత్తుకుపోతున్నాయి. ఇంట్లో ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి వాటిని అడవులకు తరిమివేయాలి.

– సీహెచ్ యాదయ్య, పోల్కంపల్లి

ఇంట్లోకి చొరబడుతున్నాయి



గ్రామంలో కోతులు ఎక్కువయ్యాయి. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తలుపులు తెరిచి ఉంటే చాలు, ఇంట్లోకి చొరబడి ఆహార పదార్థాలు అపహరిస్తున్నాయి. ఇంట్లో అందరు ఉన్నా.. ఏ మాత్రం జంకడం లేదు. వాటి ఆగడాలను తట్టుకోలేకపోతున్నాం.

– చెరుకూరి మంగ, మాజీ ఎంపీటీసీ

అప్పుచేసి పల్లెలను అభివృద్ధి చేశాం

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- మాజీ సర్పంచ్‌ల డిమాండ్
- నిరసనకు వెళ్తున్న పలువురి అరెస్ట్



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

కడ్తాల్: బీఆర్ఎస్ హయాంలో.. సర్పంచులుగా అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని మాజీ సర్పంచులు తెలిపారు. కానీ నేటి వరకు బిల్లులు రాలేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో పలువురు మాజీ సర్పంచ్‌లు హరిచంద్, తులసీరాం, భూనాథ్, సాయిలును గురువారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీలు మాట్లాడుతూ.. చేసిన అప్పులకు వడ్డీ పెరిగి, ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామనుకుంటే అరెస్టులతో అడ్డుకుంటున్నారని, వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అరెస్ట్ అప్రజాస్వామికం

సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్: 'వారి హయాంలో అప్పులు చేసి, గ్రామాలను అభివృద్ధి చేశారు. బిల్లులు చెల్లించకుండా వేధించడమే కాకుండా.. మాజీ సర్పంచులని చూడకుండా.. వారిని అరెస్టు చేసి అవమానించారు. ఇది అప్రజాస్వామికం' అని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇదేనా ప్రజా పాలన అంటూ ప్రశ్నించారు. పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుత నిరసనకు వెళ్తున్న మాజీలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడం, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నిధుల కోసం వారానికోసారి ఢిల్లీకి వెళ్తున్న ముఖ్యమంత్రికి సర్పంచ్‌ల బాధలు, కష్టాలు తెలియవా అని ప్రశ్నించారు. 16 నెలలుగా బిల్లుల కోసం మాజీ సర్పంచులు పోరాడుతున్నా ఇవ్వడం లేదని, రూ.1300 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ.6 కోట్ల రుణమాఫీ

ఇబ్రహీంపట్నం: దండుమైలారం(రాచకొండమైలారం) సహకార సంఘం పరిధి రైతులకు పంట రుణాలు రూ.6 కోట్లు మాఫీ అయ్యాయని సంఘం కార్యదర్శి ధన్‌రాజ్ వెల్లడించారు. గురువారం సంఘం అధ్యక్షుడు బిట్ల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3 కోట్ల దీర్ఘకాలిక రుణాలను రైతులకు ఇచ్చినట్లు వెల్లడించారు. తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు తీసుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి అన్నారు. ఉప్పరిగూడ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వంద కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలో ఉన్న సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఐసీఎం డైరెక్టర్ గణేశన్, సంఘ కార్యదర్శి గణేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు ప్రపంచానికి ఆదర్శం



అబ్దుల్ ఖరీంను సన్మానిస్తున్న సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు: మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచానికి ఆదర్శమని మదర్సా దారుల్ ఉలుం అన్వరే ముస్తఫా అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మదర్సా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీం నేతృత్వంలో ఆరేళ్లలో పదిమంది విద్యార్థులను కంఠస్థ ఖురాన్ బోధనలు నేర్పి, హఫీజ్ ఏ ఖురాన్ చేయడంతో గురువారం సాయంత్రం ప్రిన్సిపాల్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను సయ్యద్ ఖలీల్ సత్కరించి హాదియాను అందజేశారు. అనంతరం సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ.. మదర్సా ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్, నిజాముద్దీన్‌బాబా, అఫ్సర్, ఫరూక్, రఫిక్, అల్తాఫ్, షరీఫ్, హనీఫ్, అజీం, అక్బర్, నాజర్, హఫీజ్, అహ్మద్, అఫ్రోజ్, ముక్తార్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ జ్యోతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని 5వ వార్డులో రూ.5 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం మాజీ కౌన్సిలర్ గోరటి జ్యోతి ప్రారంభించారు. మున్సిపాలిటీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం రూ.3 లక్షలతో సీసీరోడ్డు, రూ.2 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సింహ, సత్యనారాయణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



తపాలా కార్యాలయం వద్ద వృద్ధులు

యాచారం: పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు మధ్యాహ్నం వరకు తపాలా కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. అయినప్పటికీ అధికారి రాకపోవంతో నిరాశతో వెనుతిరాగారు. గురువారం మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలోని తపాలా కార్యాలయానికి ప్రభుత్వం ఇచ్చే ఆసరా కోసం సుమారు 30 మంది వృద్ధులు వచ్చారు. అధికారి మధ్యాహ్నం వరకు రాకపోవడంతో అక్కడే వేచి ఉన్నారు. ఫోన్ చేసినా అధికారి నుంచి స్పందన రాలేదు. దీంతో చేసేది ఇంటికి వెళ్లిపోయారు. పోస్టాఫీస్ వద్ద కనీసం తాగునీరు లేదని వృద్ధులు వాపోయారు.

వడ్డీపై 90 శాతం రాయితీ

జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: ఆస్తి పన్ను వడ్డీ బకాయిలు వన్ టైం సెటిల్‌మెంట్ కింద కల్పిస్తున్న 90 శాతం రాయితీని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు బిల్ కలెక్టర్లతో పాటు వార్డు ఆఫీసర్లు, సహాయక సిబ్బంది వార్డుల వారీగా పర్యటిస్తున్నారన్నారు. ఆస్తి పన్ను చెల్లింపునకు మూడు రోజులే గడువు ఉన్నందున, చెల్లించని వారు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే వడ్డీతో సహా చెల్లించిన యజమానులకు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్ డిమాండ్‌లో సర్దుబాటు అవుతుందని ఆయన వివరించారు.



హర్యానా ప్రజల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్

ఇబ్రహీంపట్నం: ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఉప్పరిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా భాష, వేషధారణ, ఆహారం, నృత్యాలు, సంస్కృతులను విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనం వంటకాలతో ఆ రాష్ట్ర వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, వ్యాస రచన, నృత్య, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.



తలకొండపల్లి: రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



తుర్కయంజాల్: నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు

పేదల భూములను తిరిగివ్వాలి

- ఆక్రమించిన రామోజీ ఫిల్మ్‌సిటీపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం నాయకుల డిమాండ్
- భూ ఆక్రమణలపై వెల్లువెత్తిన నిరసనలు

ఇబ్రహీంపట్నం/తుర్కయంజాల్: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను ఆక్రమించిన రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అర్హులకు పట్టాలను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన నేపథ్యంలో బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి నిరసనగా.. గురువారం తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ఏనుగల్ గూడ, ముకునూరు గ్రామాలకు చెందిన 600 మంది నిరుపేదలకు 2007లో నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి పట్టాలను పంపిణీ చేశారని పేర్కొన్నారు. నాటి నుంచి పేదలను పొజిషన్‌లోకి వెళ్లకుండా ఫిల్మ్‌సిటీ అడ్డుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిటీ సభ్యుడు జె.ఆశీర్వాదం, ఎం.సత్యనారాయణ, బడుగు మాల్యాద్రి, పి.శ్రీనివాసులు, ఐ.కృష్ణ, శంకరయ్య, మాధవరెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

రామోజీ ఫిల్మ్‌సిటీ ఆక్రమించిన ఇళ్ల స్థలాల్లోకి లబ్ధిదారుల వెళ్తున్న నేపథ్యంలో.. పోలీసుల అరెస్టును ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తంచేశారు. ఇబ్రహీంపట్నం, రాయపోల్, దండుమైలారం గ్రామాల్లో రామోజీ యాజమాన్య దిష్టిబొమ్మలను దహనం చేశారు. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

అక్రమ అరెస్టులు తగదు

తలకొండపల్లి: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చాలా మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని సీపీఎం పార్టీ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. నాటి నుంచి అర్హులను పొజిషన్‌లోకి వెళ్లకుండా రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యం.. కబ్జా చేసి ప్రహరి ఏర్పాటు చేసిందని ఆరోపించారు. పేదలకు చెందిన ఇళ్ల స్థలాలు వారికే ఇవ్వాలని కోరిన పార్టీ నాయకులను.. ప్రభుత్వ అండతో అక్రమ అరెస్టు చేయించడం ఎంత వరకు సమంజసమని పెంటయ్య, చెన్నయ్యలు ప్రశ్నించారు. దీనికి నిరసనగా గురువారం మండల కేంద్రం బస్టాండ్ ప్రాంతాంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీ ఆక్రమించిన భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కె.చెన్నయ్య, డాక్టర్ రాములు, ప్రవీణ్, లక్ష్మయ్య, రాములు, దుర్గయ్య, వెంకటయ్య, విశ్వ యాదయ్య, తదితరులున్నారు.

ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీ ఫిల్మ్‌సిటీలో లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలకు ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం ఆపేది లేదని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు అన్నారు. మండలం పరిధి పోల్కంపల్లి గ్రామంలో పార్టీ పిలుపుమేరకు అక్రమ అరెస్టులకు నిరసనగా రామోజీ యాజమాన్యం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వాల అండ చూసుకొని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సిందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు జగన్, మండల నాయకులు సీహెచ్ నర్సింహ, ఆనంద్, నర్సింహ, బాలరాజ్, కరుణాకర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: రామోజీ ఫిల్మ్‌సిటీ ఆధీనంలో ఉన్న పేదల ఇంటి స్థాలాలను స్వాధీనం చేసుకోవడానికి వెళితే.. ప్రజలు, నాయకులను అరెస్టు చేసి, అక్రమంగా కేసులు పెట్టడం సరైంది కాదని సీపీఎం నాయకులు అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫిల్మ్‌సిటీ ఆక్రమించుకున్న ఇళ్ల స్థలాలను పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుల అరెస్టులను నిరసిస్తూ.. గురువారం మండల కేంద్రంలోని సాగర్ రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అప్పగించాలి

ఆమనగల్లు: రామోజీ ఫిల్మ్‌సిటీలోని నాగన్‌పల్లి గ్రామ పరిధి సర్వే నం.189, 203లో పేదలకు ఇచ్చిన పట్టాలను తిరిగి వారికే అప్పగించాలని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ శివశంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం 577 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినప్పటికీ.. ఫిల్మ్‌సిటీ యాజమాన్యం ఈ భూములను కబ్జా చేసిందని ఆరోపించారు. పేదలకు మరోచోట భూములను కేటాయిస్తామని నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. కేటాయించిన స్థలాల వద్దకు పేదలను వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన ఖండించారు.

మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో ముస్లింలు

కడ్తాల్: మండల కేంద్రంలో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షబ్–ఎ–ఖదర్‌ను పురస్కరించుకుని మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షలు విరమించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావిద్, నాయకులు జహంగీర్‌అలీ, లాయక్‌అలీ, జహంగీర్‌బాబా, ఇర్షాద్, అమీర్, అజ్గర్‌అలీ, మహబూబ్‌అలీ, నదీం, ఖలేద్, మేరాజ్, నిజాం తదితరులు ఉన్నారు.

ఇచ్చిన సర్టిఫికెట్లకు కబ్జా చూపండి

- ఆర్డీఓ చాంబర్‌లో బైఠాయించి లబ్ధిదారుల నిరసన

కందుకూరు: ఇచ్చిన సర్టిఫికెట్లకు సంబంధించి ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ చాంబర్‌లో లబ్ధిదారులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. 2007, 2023 సంవత్సరాల్లో కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్లు 788, 107లలో అర్హులైన పేదలకు అప్పటి ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసిందన్నారు. ఇంత వరకు ఇంటి జాగాను చూపలేదన్నారు. ఆ భూముల్లో గుడిసెలు వేసుకుని చేసిన పోరాటంతో పాటు ఎన్నోమార్లు వివిధ రూపాల్లో లబ్ధిదారుల తరఫున ఉద్యమాలు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలం ఇవ్వలేని సర్కారు ఎందుకని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించే వరకు కదిలేదిలేదన్నారు. కాగా ఏప్రిల్ 15 వరకు సమస్య పరిష్కరిస్తానని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో వారు శాంతించి నిరసన విరమించారు. సీపీఎం నాయకులు శ్రీనివాస్, కుమార్, జి.శ్రీశైలం, నరసింహ, చందు ఉన్నారు.



ఆర్డీఓ చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు